సాక్షి కామారెడ్డి
ఆదివారం । 15 । జూన్ । 2025



కంకర తేలి..

మద్నూర్ మండల కేంద్రంలో రెండు నెలల క్రితం వేసిన సీసీ రోడ్డు నాణ్యత లోపంతో కంకర తేలి అధ్వానంగా మారింది.

- 9లో ▸



ప్రాణదానంతో సమానం

జిల్లాలో శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించారు. పలుచోట్ల రక్తదాతలను సన్మానించారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.7 /23.7


ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

నాన్నే.. నా హీరో

• నాన్నంటే వెన్నంటి నిలిచే ధైర్యం • స్ఫూర్తి ప్రదాత, నిజమైన స్నేహితుడు • నేడు ఫాదర్స్ డే

అమ్మ నవమాసాలు మోసి జన్మనిస్తుంది. ఆ తర్వాత బిడ్డల భారం మోసేది నాన్న.. చిటికెన వేలు పట్టి నడిపిస్తూ... భుజాలపై మోస్తూ ప్రపంచాన్ని చూపిస్తాడు. ఎన్ని కష్టాలనైనా బిడ్డల కోసం భరిస్తాడు. వారి కోసం ఎన్నో త్యాగాలు చేస్తాడు. తన ఆనందాలనూ వదులుకుంటాడు. పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించేందుకు అహర్నిశలు శ్రమిస్తాడు. వారు సాధించిన విజయాలను చూసి పొంగిపోతాడు. తమ భవిష్యత్ కోసం తాను కొవ్వొత్తిలా కరిగిపోయిన నాన్నే తమ హీరో అని, స్ఫూర్తి ప్రదాత అని చాలా మంది పిల్లలు చెప్పుకుంటున్నారు. ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



నాన్నే మార్గదర్శి..



తండ్రితో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

మా నాన్న క్రిషన్‌పాల్ సంగ్వాన్ హర్యానాలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. తన సర్వీసులో వేలాది మందిని తీర్చిదిద్దారు. నా జీవితానికి ఆయనే మార్గదర్శి. ఆయనే ప్రేరణ. ఆయన అందించిన ప్రోత్సాహంతోనే ఈ స్థాయికి ఎదిగాను. దయ, దాతృత్వం, ఔదార్యం వంటి విలువలన్నీ ఆయన నుంచే నేర్చుకున్నాను. నిస్వార్థంగా సేవ చేయాలని, అవసరం ఉన్న వారికి సాయం అందించాలని ఆయన చెప్పిన మాటలు నా మదిలో నిరంతరం మెదులుతూనే ఉంటాయి. నాన్న నాటిన విలువలు పాటిస్తూ ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడానికి నేను చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయని ఆశిస్తున్నాను. నాన్న ఏడాదిలో సగం రోజులైనా నా వద్దకు వచ్చి ఉండి వెళతారు. నేను ఎదిగిన తీరును చూసి ఆయన సంతోషపడతారు. ఫాదర్స్ డే సందర్భంగా నాన్నకు శుభాకాంక్షలు.

– ఆశిష్ సంగ్వాన్, కలెక్టర్, కామారెడ్డి

నాన్నే రోల్ మోడల్..



తండ్రితో ఎస్పీ రాజేశ్ చంద్ర

మా నాన్న ఎం.రాములు సహకార శాఖలో ఉద్యోగం చేసేవారు. గతేడాది చనిపోయారు. ఆయన లేకపోవడం నాకు ఎంతో లోటు. మా నాన్న గొప్ప మానవతావాది. ఆయనే నాకు రోల్ మోడల్. నా హీరో. ఏ పని అయినా బాధ్యతగా చేయాలని చెప్పేవారు. మా నాన్నను చూసే చాలా విషయాలు నేర్చుకున్నాను. నా పనితీరు విధానం నాన్నలాగే ఉంటుంది. సివిల్ సర్వీసెస్‌లో మూడుసార్లు సక్సెస్ కాలేకపోయాను. ఆ సమయంలో నా వెన్నంటే ఉండి ధైర్యం చెప్పారు. మరో ప్రయత్నం చేయమంటూ ప్రోత్సహించారు. ఆయన అందించిన ప్రోత్సాహం, ఇచ్చిన ధైర్యం వల్లే సక్సెస్ అయ్యాను. మొదటి నుంచి ఆయన మా చదువుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూశారు. ఆయన మా కోసం ఎన్నో త్యాగాలు చేశారు. ఈ సమయంలో ఆయన లేకపోవడం నాకు ఎంతో లోటు. ఆయన చిన్ననాటి నుంచి చెప్పిన మాటలన్నీ నా మదిలో మెదలుతూనే ఉంటాయి.

– ఎం.రాజేశ్ చంద్ర, ఎస్పీ, కామారెడ్డి

నాన్న సపోర్ట్‌తోనే..



తల్లిదండ్రులతో ఏఎస్పీ చైతన్యరెడ్డి

మా నాన్న సంజీవ రెడ్డి జిల్లా సహకార శాఖ అధికారిగా పనిచేస్తున్నారు. ఇష్టంగా చదవాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు నడవాలని చిన్నప్పటి నుంచి మోటివేట్ చేసేవారు. చదువుపై ఎక్కువ శ్రద్ధ చూపాలనేవారు. ఆల్ ఇండియా సర్వీస్ సాధించి ప్రజలకు సేవ చేయాలనేవారు. ఇంజినీరింగ్ పూర్తయ్యాక సాఫ్ట్‌వేర్ ఉద్యోగం, తర్వాత ప్రభుత్వ ఉద్యోగంలో చేరాలన్న ఉద్దేశంతో ఇరిగేషన్ డిపార్ట్‌మెంటులో ఉద్యోగం సాధించాను. సివిల్స్ సాధించాలన్న లక్ష్యంతో యూపీఎస్సీకి ప్రిపేర్ అయ్యాను. ఫెయిల్యూర్స్ వచ్చినపుడు ప్రయత్నించమని నాన్న ఎంతో సపోర్ట్ చేశారు. నాన్న సపోర్ట్ చేయడం వల్లే సాధించాను. ప్రతి ఒక్కరూ తమ ఆలోచనలను తల్లిదండ్రులతో ఓపెన్‌గా షేర్ చేసుకోవాలి. మనం పడిపోతే పట్టుకునేది, అండగా ఉండేది పేరెంట్సే. వాళ్లకు రెస్పెక్ట్ ఇవ్వాలి. మన సమస్యలను ఓపెన్‌గా చెప్పుకోగలగాలి. పేరెంట్స్ కూడా ఆ ఫ్రీడం ఇవ్వాలి. ఫాదర్స్ డే సందర్భంగా నాన్నకు శుభాకాంక్షలు.

– బి.చైతన్యరెడ్డి, ఏఎస్పీ, కామారెడ్డి

సండే స్పెషల్

న్యూస్‌రీల్

నీట్‌లో మెరిసిన బంజపల్లివాసి



మాచారెడ్డి: బంజపల్లికి చెందిన అజ్మీర అశుతోష్ శనివారం వెలువడిన నీట్ ఫలితాల్లో 570 మార్కులు సాధించి ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 5 వేలు, ఎస్టీ కేటగిరీలో 32వ ర్యాంక్ సాధించాడు. అశుతోష్ తల్లిదండ్రులు శాంత, లింగం ఉపాధ్యాయులు. ఉత్తమ ర్యాంక్ సాధించిన అతడిని గ్రామస్తులు అభినందించారు.

బిచ్కుంద వాసి..



బిచ్కుంద: మండల కేంద్రానికి చెందిన రచ్చ శ్రీవేద శృతిక నీట్ పరీక్షలో 586 మార్కులతో ఆల్ ఇండియా ఓబీసీ కేటగిరీలో 927 ర్యాంక్ సాధించింది. ఆమె తండ్రి రచ్చ శివకాంత్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

'అన్ని వర్గాలకు అండగా మోదీ సర్కార్'



కామారెడ్డి టౌన్: అన్ని వర్గాలకు అండగా కేంద్రంలోని మోదీ సర్కార్ నిలుస్తోందని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి 11 ఏళ్లవుతున్న సందర్భంగా జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ అభివృద్ధి కోసం ప్రధానిగా మోదీ ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నారన్నారు. ఆయన హయాంలో దేశం సాధించిన ప్రగతిని వివరించారు. అనంతరం మోదీ విజయాలపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. వికసిత భారత్ 2047 లక్ష్యంపై బీజేపీ కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చిన్నరాజులు, ప్రధాన కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు విపుల్, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు నరేందర్, శ్రీనివాస్, సురేష్, వేణు, సంతోష్‌రెడ్డి, రవీందర్, రాజు పాల్గొన్నారు.

'పారదర్శకంగా బదిలీలు నిర్వహించాం'

కామారెడ్డి క్రైం: జిల్లా పోలీస్ శాఖలో బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని ఎస్పీ రాజేశ్ చంద్ర శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. 79 మంది హోంగార్డులు, 63 మంది సివిల్, ఏడుగురు ఎంప్టీ సెక్షన్ ఏఆర్ కానిస్టేబుళ్లు, 20 మంది సివిల్ హెడ్‌కానిస్టేబుళ్లు, 23 మంది ఏఎస్సైలకు కౌన్సెలింగ్ ద్వారా బదిలీల ప్రక్రియను నిర్వహించామని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను శనివారం జారీ చేశారు. ప్రతి పోలీస్ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. నిబంధనలు పాటించకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రూ.40 లక్షలతో పరారీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఎల్లమ్మగుట్ట ప్రాంతంలోని ఓ ప్రయివేటు సెక్యూరిటీ ఏజెన్సీలో పనిచేసే ఉద్యోగి ఏటీఎంలో డిపాజిట్ చేసే నగదు తీసుకొని పారిపోయినట్లు నాలుగోటౌన్ ఎస్సై శ్రీకాంత్ శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఎల్లమ్మగుట్ట వద్ద ఉన్న ప్రయివేటు ఏజెన్సీ ద్వారా ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకులకు చెందిన ఏటీఎంలలో డబ్బులను డిపాజిట్ చేస్తారు. శనివారం ఉదయం విధులకు వచ్చిన న్యాల్‌కల్ రోడ్‌కు చెందిన రమాకాంత్ రూ.40 లక్షల 50 వేలు ఏజెన్సీ వద్ద ఉన్న వాహనంలో పెడుతుండగా ఎత్తుకొని పరారైనట్లు చెప్పారు. రమాకాంత్ ఎత్తుకెళ్లిన డబ్బులను బోధన్‌లోని ఓ బ్యాంక్ ఏటీఎంలో డిపాజిట్ చేయాల్సి ఉన్నట్లు సమాచారం. బ్యాంక్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జిల్లాకు అవార్డు రావడంపై హర్షం

కామారెడ్డి అర్బన్: రక్తదానంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేసిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డును అందుకోవడంపై టీఎన్జీవోస్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. రక్తదానంలో ఉద్యోగులు సైతం భాగస్వాములు అయ్యారని పేర్కొన్నారు. జిల్లాకు అవార్డు రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి టీఎన్జీవోస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, నాగరాజు ధన్యవాదాలు తెలిపారు.

బెస్ట్ బ్లడ్ డోనర్‌గా కామారెడ్డి జిల్లా



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా బెస్ట్ బ్లడ్ డోనర్ అవార్డును అందుకుంటున్న కలెక్టర్ సంగ్వాన్

గవర్నర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన కలెక్టర్

కామారెడ్డి క్రైం: ఏడాది కాలంలో అధిక సంఖ్యలో రక్తదాన శిబిరాలు నిర్వహించి, పెద్ద మొత్తంలో రక్త నిల్వలను అందించినందుకుగాను కామారెడ్డి జిల్లాకు బెస్ట్ బ్లడ్ డోనర్ అవార్డు దక్కింది. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. ఆయన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌గా వ్యవహరిస్తూ క్రమం తప్పకుండా జిల్లాలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. అవగాహన కార్యక్రమాలు చేపడుతూ రక్తదాతలను ప్రోత్సహిస్తున్నారు. అన్ని శాఖల అధికారులతో మాట్లాడి ప్రతినెలా ఒక శాఖ ఉద్యోగులతో శిబిరాలను ఏర్పాటు చేయడం, రెడ్‌క్రాస్ సొసైటీ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో విరివిగా శిబిరాలను నిర్వహించడం ద్వారా జిల్లాలో రక్త నిల్వల సేకరణ బాగా పెరిగింది. వాటిని అత్యవసర సమయాల్లో ఉన్న వారికి, పేదల అవసరాలకు ఉపయోగించేవారు. కలెక్టర్ సేవలను గుర్తించిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కమిటీ కామారెడ్డికి బెస్ట్ బ్లడ్ డోనర్ అవార్డు ప్రకటించింది. అవార్డును స్వీకరించిన అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ బెస్ట్ బ్లడ్ డోనర్ అవార్డు వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. ఇది జిల్లాకు గర్వకారణమన్నారు. రక్తాన్ని సేకరించడంలో తనతో పాటు కృషి చేసిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్, స్టేట్ ఎంసీ మెంబర్ సంజీవరెడ్డి, ఐఆర్‌సీఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రాజీయే రాజమార్గం

• కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ మంచి అవకాశం
• జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్, వేదికపై న్యాయమూర్తులు నాగరాణి, సుమలత, దీక్ష, సుధాకర్

కామారెడ్డి టౌన్: రాజీయే రాజమార్గమని, కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ మంచి అవకాశం కల్పిస్తోందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సీహెచ్. వీఆర్ఆర్ వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. కామారెడ్డిలోని జిల్లా కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ కేసు పరిష్కారమై అవార్డు పాస్ చేస్తే అది అంతిమ తీర్పు అవుతుందన్నారు.

చీటింగ్ కేసులు, సైబర్ కేసులు, బ్యాంకు ప్రీ లిటిగేషన్ కేసులు, చెక్ బౌన్స్ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ముఖ్యంగా భార్యాభర్తల కేసులు కూడా పరిష్కరిస్తామన్నారు. వీలైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి టి.నాగరాణి పోలీసులు, న్యాయవాదులకు సూచించారు. పోలీస్ శాఖ తరపున పూర్తిగా సహాయ సహకారాలు ఉంటాయని జిల్లా అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి పేర్కొన్నారు.

జిల్లాలో 1,840 కేసుల పరిష్కారం

జిల్లాలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1,840 కేసులను పరిష్కరించారు. ఇందులో 1,751 క్రిమినల్ కేసులు, రెండు సివిల్, 15 మోటర్ యాక్సిడెంట్స్ క్లయిమ్స్ ట్రిబ్యునల్(ఎంఏసీటీ) కేసులు, 37 సైబర్ క్రైం కేసులు, 35 ప్రీ లిటిగేషన్ బ్యాంక్ కేసులున్నాయి. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఈట సుమలత, జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దీక్ష, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేశ్, పీపీలు రాజగోపాల్ గౌడ్ , దామోదర్‌రెడ్డి, సూర్యప్రకాశ్, సీఐలు చంద్రశేఖర్‌రెడ్డి, సంపత్, న్యాయవాదులు శంకర్‌రెడ్డి, దేవరాజ్‌గౌడ్, శ్రీధర్, శ్యామ్ గోపాల్‌రావు, న్యాయ శాఖ సిబ్బంది భుజంగ్‌రావు, శ్రీధర్, చంద్రసేన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ. 1.40 కోట్ల పరిహారం

తాడ్వాయి సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ప్రభుత్వ ఉద్యోగి తల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ కుటుంబానికి రూ. 1.40 కోట్ల చెక్కును అందజేశారు. మృతుడి కుటుంబసభ్యులు పరిహారం కోసం ఇన్సూరెన్స్ కంపెనీకి వెళ్లగా.. వారు క్లయిమ్ ఇవ్వకపోవడంతో వివాదం నడిచింది. దీంతో ఇన్సూరెన్స్ కంపెనీ సహా ప్రతివాదులపై కోర్టులో క్లయిమ్ దాఖలు చేశారు. శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో ఈ కేసును రాజీ కుదిర్చి, మృతుడి కుటుంబ సభ్యులకు ఇన్సురెన్స్ కంపెనీ నుంచి మంజూరైన చెక్కును అందించారు.

పండ్ల తోటల పెంపకంపై అనాసక్తి

• ముందుకు రాని రైతులు
• సంప్రదాయ పంటల సాగుకే మొగ్గు



బాన్సువాడ సమీపంలోని మామిడి తోట

బాన్సువాడ రూరల్: పండ్ల తోటల సాగును పెంచేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తున్నా రైతులు మాత్రం ఆసక్తి చూపడం లేదు. సంప్రదాయ పంటల సాగుకే మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది సుమారు 400 ఎకరాల్లో పండ్ల తోటలు పెంచాలని సీఆర్‌డీ లక్ష్యాన్ని నిర్దేశించింది. దీనికి అనుగుణంగా జిల్లా అధికారులు ఉపాధి హామీలో భాగంగా 22 మండలాలకు లక్ష్యాన్ని కేటాయించి ఆసక్తిగల రైతులతో పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టాలని ఆదేశించారు. దీంతో క్షేత్రస్థాయిలో పర్యటించిన ఉపాధి హామీ సిబ్బంది, మండల అధికారులు ఆసక్తి ఉన్న సన్న, చిన్న కారు రైతులు ఉద్యాన, పండ్లతోటలు సాగు చేసేందుకు ముందుకు వస్తే అన్ని రకాలుగా ప్రోత్సాహం అందిస్తామని సూచించారు. ఉద్యానవన పంటల సాగులో మామిడి, బత్తాయి, నారింజ, జామ, సీతాఫలం, డ్రాగన్‌ఫ్రూట్, సపోట, కొబ్బరి, దానిమ్మ, మునగ, ఆయిల్‌పామ్ వంటి వాటిని రైతులు తమ భూముల పరిస్థితికి అనుగుణంగా ఎంపిక చేసుకునే అవకాశం ఉందని అవగాహన కల్పించారు. ముందస్తుగా బిందు సేద్యానికి దరఖాస్తు చేసుకుంటే హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ ద్వారా 90 శాతం రాయితీపై పరికరాలు అందిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 215 మంది రైతులనుంచి 296 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు స్వీకరించారు. అయితే 13 మంది రైతులకు చెందిన 13 ఎకరాలకు మాత్రమే ఎస్టిమేషన్ జనరేట్ అయ్యింది. ఇందులోనూ ఇద్దరు రైతులు మాత్రమే మొక్కలు నాటడానికి గుంతలు తీయడం గమనార్హం. పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి లేకపోవడంతో రైతులు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

రైతులు ముందుకు రావాలి



పండ్లతోటల పెంపకానికి రైతులు ముందుకు రావాలి. ఉద్యానవన పంటల సాగుతో రైతులు మెరుగైన లాభాలు సాధించవచ్చు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటే సంబంధిత శాఖ అధికారులు అన్ని విధాలుగా సహకరిస్తారు. టార్గెట్‌ను పూర్తిచేయడానికి కృషి చేస్తున్నాం.

– ముజాహిద్, ఎంపీడీవో, బాన్సువాడ



బ్రాహ్మణపల్లిలో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

తాగునీటి కోసం ధర్నా

గాంధారి: బ్రాహ్మణపల్లి గ్రామంలో 15 రోజులుగా తాగునీటి సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ గ్రామస్తులు శనివారం ఖాళీ బిందెలతో పంచాయతీ వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని, గ్రామంలో ఉన్న రెండు బోర్లు పనిచేయడం లేదని పేర్కొన్నారు. ఈ విషయమై కార్యదర్శికి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రజల ధర్నాతో అధికారులు స్పందించారు. మధ్యాహ్నం వరకు మరమ్మతులు చేసి తాగు నీటి సరఫరాను పునరుద్ధరించారు. మోటార్లు పాడైపోవడం, వైర్లు తెగిపోవడంతో బోరుబావులు నడవడం లేదని పంచాయతీ కార్యదర్శి సరస్వతి పేర్కొన్నారు. సాంకేతిక కారణాలతో మిషన్ భగీరథ నీరు రావడం లేదన్నారు. బోర్లకు శనివారం మరమ్మతులు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించామన్నారు.

మహమ్మద్‌నగర్‌లో రోడ్డెక్కిన ప్రజలు



మహమ్మద్‌నగర్‌లో రాస్తారోకో చేస్తున్న ప్రజలు

నిజాంసాగర్: ''నల్లా నీళ్లు రాక వారం రోజులాయె.. గొంతు తడపుకునేందుకు గుక్కెడు నీళ్ల దిక్కు లేవు'' అంటూ మహమ్మద్‌నగర్‌వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మహమ్మద్‌నగర్ పంచాయతీ పరిధిలోని జంగాల కాలనీవాసులు బస్టాండ్ వద్ద ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడం, గ్రామ పంచాయతీ బోరు మోటార్లు చెడిపోవడంతో తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొంటున్నామన్నారు. పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని సముదాయించారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

వాహనాల తనిఖీ



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని అచ్చంపేట శివారులోగల నాందేడ్–సంగారెడ్డి జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలను శనివారం ఎస్సై శివకుమార్, సిబ్బంది తనిఖీ చేశారు. వాహనదారులకు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు లేనివారికి జరిమానాలు విధించినట్లు ఎస్సై తెలిపారు.

బురద మట్టిలో ఇరుక్కున్న లారీ



దోమకొండ: మండలంలోని ముత్యంపేట గ్రామ శివారులో శనివారం మధ్యాహ్నం ఓ లారీ బురదలో ఇరుక్కుపోగా నాలుగు గంటల పాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కామారెడ్డి మండలం క్యాసంపల్లి నుంచి దోమకొండ వరకు బీటీ రోడ్డు పనులకు నిధులు మంజూరు కాగా, సదరు కాంట్రాక్టర్ ముత్యంపేట వరకు పనులు పూర్తి చేసి వదిలేశాడు. ముత్యంపేట నుంచి దోమకొండ వరకు రోడ్డుకు ఇరువైపులా మట్టిని పోశారు. కాగా కొందరు రోడ్డు మధ్యలో వర్షం నీరు నిలుస్తుందని మట్టిని పోయించినట్లు తెలిసింది. వర్షానికి మట్టి పూర్తిగా బురదగా మారడంతో వాహనాలు బురదలో ఇరుక్కుంటున్నాయని గ్రామస్తులు తెలిపారు. దోమకొండ నుంచి కామారెడ్డికి లోడ్‌తో వెళుతున్న లారీ బురదలో ఇరుక్కొగా ఆర్టీసీ బస్సులు కూడా ముత్యంపేట నుంచి తిరిగి కామారెడ్డికి వైపుకు వెళ్లిపోయినట్లు వారు తెలిపారు. లారీని చివరకు జేసీబీ సాయంతో తీశారు.

రోడ్డుపై కూలిన మర్రిచెట్టు



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి–కామారెడ్డి ప్రధాన రహదారిపై పెద్ద మర్రి వృక్షం నేల కూలడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. శుక్రవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు ఎల్లారెడ్డి డిగ్రీ కళాశాల సమీపంలో గల ప్రధాన రహదారిపై పెద్ద మర్రిచెట్టు కూలిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. సమాచారం అందుకున్న ఎస్సై మహేష్ జేసీబీతో చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

పనులను వెంటనే ప్రారంభించాలి



బాన్సువాడ రూరల్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ అనుమతి లభించిన లబ్ధిదారులందరూ వెంటనే ఇంటి పనులు ప్రారంభించాలని జక్కల్‌దాని తండా కాంగ్రెస్ నాయకులు బన్సీనాయక్, రవి అన్నారు. ఈసందర్భంగా గ్రామంలో వారు శనివారం లబ్ధిదారులతో కలిసి ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసి భూమిపూజ చేశారు. ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

టీపీసీసీ ప్రధాన కార్యదర్శిని కలిసిన నాయకులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డిని శనివారం తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు కామారెడ్డిలో కలిశారు. పదవి రావడంపై అభినందనలు తెలిపారు. వీడీసీ చైర్మన్ ఏనుగు మోహన్‌రెడ్డి, లక్ష్మణచారీ, రాజలింగం, శ్రీనివాస్‌గౌడ్, మల్లేశ్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, రాజిరెడ్డి, ముఖేష్‌గౌడ్ ఉన్నారు.

పిల్లల కోసం కష్టపడ్డారు..

- ఉజ్వల భవిష్యత్ కోసం తల్లిదండ్రుల తాపత్రయం
- నేడు ఫాదర్స్ డే

తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయిలో ఉంచాలని తల్లిదండ్రులు తాపత్రయపడుతుంటారు. నేడు ఫాదర్స్ డే సందర్భంగా తమ పిల్లలను కష్టపడి ఉన్నత స్థాయిలో నిలిపిన తండ్రుల వివరాలతో 'సాక్షి ప్రత్యేక కథనం..



దుబ్బ తండాకు చెందిన చంద్ర్యా కుటుంబం



గాంధారి మండలం దుబ్బ తండాకు చెందిన మంగత్యా నాయక్ కుటుంబం



గాంధారి మండల కేంద్రానికి చెందిన హరాళే రావుసాహెబ్‌రావు కుటుంబం

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని దుబ్బ తండాకు చెందిన కాట్రోత్ మంగత్యా నాయక్ తండాకు పెద్ద నాయకుడే అయినా తండాలోనే అతి పేద రైతు. తన కున్న రెండెకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా తన ముగ్గురు పిల్లలు సుజాత, రమేష్, సురేష్‌ను ఉన్నత చదువులు చదివించాడు. సుజాత బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసింది. నర్సింగ్ ఆఫీసర్‌గా ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తుంది. పెద్ద కుమారుడు రమేష్ జూనియర్ లెక్చరర్‌గా ప్రభుత్వ ఉద్యోగం సాధించి పెద్దపల్లి జిల్లాలో విధులు నిర్వహిస్తున్నాడు. చిన్న కుమారుడు సురేష్ ఎస్‌బీఐ క్లర్క్ ఉద్యోగం సాధించాడు. అదే తండాకు చెందిన దేవసోత్ చంద్ర్యా దంపతులు వ్యవసాయం చేస్తూ తన కుమారుడు ప్రేమ్‌సింగ్‌ను చదివించారు. దీంతో ప్రేమ్‌సింగ్ పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం సాధించి విధులు నిర్వహిస్తున్నాడు. మండల కేంద్రానికి చెందిన హరాళే రావుసాహెబ్ రావు వ్యవసాయం చేస్తూ తన ఇద్దరు కుమారులను ఉన్నత చదువులు చదివించాడు. పెద్ద కుమారుడు ధీరజ్ బీటెక్ పూర్తి చేసి ప్రైవేటు కంపనీలో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు సౌరభ్ లక్నోలో ఎంబీఏ పూర్తి చేశాడు. ఓ కంపెనీలో ఉద్యోగానికి ఎంపికై, ఏడాదికి రూ. 40లక్షల ప్యాకేజీ అందుకున్నాడు. తన ఇద్దరు కుమారులు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు పొందడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తండ్రి కల నెరవేరింది



తల్లిదండ్రులతో సిద్ధార్థ్

బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన బుక్కావార్ రాంచందర్ రేషన్ డీలర్‌గా పనిచేస్తూ కొడుకును ఉన్నత చదువులు చదివించి డాక్టర్‌ను చేశాడు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఎదురొచ్చిన వెనకడుగు వేయకుండా కష్టపడి చదివించాడు. ప్రస్తుతం బాన్సువాడ ఏరియా ఆస్పత్రితో కాంట్రాక్ట్ బేసిక్‌పై డాక్టర్‌గా సేవలు అందిస్తున్నారు. కూతురు బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ, బీజెడ్సీ చేస్తుంది. మా వంశంలో ఒక్కరైన డాక్టర్ అవ్వాలని ఎన్నో కలలు కన్నాము, కొడుకు సిద్ధార్థ్ డాక్టర్ పట్టా పొందిన రోజు మా కల నిజమైంది అని రాంచందర్ పేర్కొన్నాడు. తన కొడుకు బిచ్కుందలో వైద్యుడిగా సేవలు అందించే విధంగా తండ్రిగా నావంతు కృషి చేస్తానన్నారు.

నాన్న కష్టం వల్లే ఉన్నత స్థాయికి..



తల్లిదండ్రులతో సురేష్

మాచారెడ్డి: నాన్న ఒక పూట తింటూ మరో పూట పస్తులుంటూ చదివించారని, ఆయన కష్టం వల్లే తాను బ్యాంక్ మేనేజర్ అయ్యానని చుక్కాపూర్ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల సురేష్ అన్నారు. ఫాదర్స్ డే సందర్భంగా సాక్షితో తన తండ్రి కష్టాన్ని వివరించాడు. రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితిలో ఉన్నప్పటికీ తనను బాగా చదివించడం కోసం తన తండ్రి మరింత కష్టపడ్డారన్నారు. వారి కష్టాలను తీర్చేందుకు బాగా చదివానని, 2017లో బ్యాంకు పీవోగా ఉద్యోగం సంపాదించానన్నారు. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని ఎస్బీఐ బ్రాంచ్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నానన్నారు. తనను ఈ స్థాయికి తీసుకువచ్చిన తల్లిదండ్రులు లక్ష్మి, నర్సయ్యల రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదన్నారు.

కష్టపడి.. కొడుకులను ప్రయోజకులను చేసి..



భార్య లక్ష్మితో కోటాయి చిన్న సిద్దయ్య



కుమారులు రమేష్, రాజు, అంజనేయులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన కోటాయి చిన్న సిద్దయ్యకు ముగ్గురు కుమారులు. వారిని ఉన్నతంగా చదివించి ఉజ్వల భవిష్యత్‌కు అండగా నిలిచి తండ్రిగా విజయం సాధించాడు. గ్రామంలో తనకున్న ఎకరంన్నర భూమిని నమ్ముకుని వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ వచ్చాడు. పిల్లల ఉన్నత చదువు కోసం భార్య లక్ష్మితో కలిసి 20 ఏళ్ల క్రితం కామారెడ్డి పట్టణానికి వచ్చాడు. సిద్దయ్యకు వ్యవసాయం మీద వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో పట్టణంలోని ఓ ఆయిల్ మిల్‌లో పనిలో చేరాడు. అలా రెండు పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ కుమారులను ఉన్నతంగా చదివించాడు. ప్రస్తుతం పెద్ద కుమారుడు ఆంజనేయులు జిల్లాలోని ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రెండో కుమారుడు రాజు కేంద్ర ప్రభుత్వ మహిళా, శిశు సంక్షేమ శాఖ చెన్నైలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇక మూడో కుమారుడు డాక్టర్ రమేష్ చిన్న పిల్లల వైద్య నిపుణుడిగా కామారెడ్డిలో కొనసాగుతున్నాడు. కుమారులు మంచిగా స్థిరపడంతో కష్టానికి తగ్గ ఫలితం దక్కిందని సంతోషంగా ఉన్నానని సాక్షితో సిద్దయ్య చెప్పాడు.

వ్యవసాయం చేస్తూనే..



కుటుంబ సభ్యులతో నేనావత్ సంగ్యా నాయక్



కూతురు పద్మావతితో పాల్త్య విఠల్

నస్రుల్లాబాద్: మండలంలోని సంగం గ్రామానికి చెందిన సంగ్యా నాయక్ వ్యవసాయం చేస్తూనే, తన ముగ్గురు పిల్లలను ఉన్నతంగా చదివిస్తున్నారు. పెద్ద కుమారుడు కల్యాణ్ ఐఐటీ మూడో సంవత్సరం చదువుతుండగా, రెండో కొడుకు చంద్రశేఖర్ ఐఐటీలో సీటు సాధించారు. కూతరు పద్మావతి బీఎస్సీ నర్సింగ్ చదువుతోంది. ఓ సాధారణ రైతు తమ పిల్లలను ఉన్నతంగా చదివిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు.

అమ్మాయి అమెరికాలో ఎంఎస్....

సాధారణంగా అమ్మాయికి వయస్సు రాగానే పెళ్లి చేయాలన్న ఆలోచనలో తల్లిదండ్రులు ఉంటారు. కానీ సంగం గ్రామానికి చెందిన విఠల్ తన కూతురు మాత్రం విదేశాల్లో చదవాలని కోరుకున్నాడు. అందుకు అనుగుణంగానే ఆయన కూతురు పాల్త్య పద్మావతి హైదరాబాద్‌లో బీడీఎస్ చేసింది. తండ్రి ఆశయ సాధనకు అమెరికాలో ఎంఎస్ చేస్తుంది. ఓ తండాలో వ్యవసాయ కుటుంబ నేపథ్యం ఉన్న విఠల్ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

క్రైం కార్నర్

చెరువులో పడి మత్స్యకారుడి మృతి



లక్ష్మణ్ మృతదేహం

బీబీపేట: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన శనివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుర్రం లక్ష్మణ్ (35) శుక్రవారం స్థానిక పెద్ద చెరువులో చేపలవేటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం చెరువు వద్దకు వెళ్లి చూడగా లక్ష్మణ్ మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

కేజీవీల్ ట్రాక్టర్ ఢీకొని ఒకరు..

బోధన్‌రూరల్: మండలంలోని సంగం గ్రామంలో నాయకం ఎర్ర సాయిలు (48) కేజీవీల్ ట్రాక్టర్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం నాయకం ఎర్ర సాయిలు గ్రామంలోని చౌరస్తా వద్ద గల హోటల్‌లో టీ తాగి నడుచుకుంటూ వెళుతున్నాడు. అదే సమయంలో గ్రామానికి చెందిన సూర శ్రీనివాస్ కేజీవీల్ ట్రాక్టర్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ సాయిలును ఢీకొట్టాడు. దీంతో దమ్ము చక్రాల కింద పడిపోవడంతో సాయిలు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మచ్చేందర్ రెడ్డి పేర్కొన్నారు.

దేశీదారు పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ ఎస్సై సత్యనారాయణ

నిజాంసాగర్(జుక్కల్): మద్నూర్ మండలం రుశేగావ్ చౌరస్తా వద్ద శనివారం 10 దేశీదారు మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు బిచ్కుంద ఎక్సైజ్ ఎస్సై సత్యనారాయణ తెలిపారు. రుశేగావ్ నుంచి ద్విచక్ర వాహనంపై దేశీదారు మద్యం తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు చౌరస్తా వద్ద ద్విచక్ర వాహనదారుడుని పట్టుకొని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దేశీదారు తరలిస్తున్న బండి సురేశ్‌తోపాటు దిగంబర్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

చోరీ కేసులో ఒకరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై మహేశ్

ఎల్లారెడ్డి: పట్టణంలోని సత్యం కిరాణా దుకాణంలో చోరీకి పాల్పడిన వ్యక్తిని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని భిక్కనూర్ గ్రామానికి చెందిన కోడేనోళ్ల రాజు ఈ నెల 11న రాత్రి సత్యంకు చెందిన కిరాణా దుకాణంలో చోరీకి పాల్పడ్డాడు. శనివారం ఎల్లారెడ్డిలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్న రాజును పట్టుకొని విచారించగా కిరాణా దుకాణంలో చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు

ఇందల్వాయి: మండలంలోని లోలం వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ శనివారం తెలిపారు. వాగు నుంచి కొందరు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు వెళ్లి చూడగా ట్రాక్టర్ డ్రైవర్ల వద్ద అనుమతి పత్రాలు లేవన్నారు. దీంతో కేసు నమోదు చేశామన్నారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

కంటైనర్, టీవీఎస్ ఎక్సెల్ ఢీ

- ఇద్దరికి గాయాలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలో జాతీయ రహదారిపై కంటైనర్, టీవీఎస్ ఎక్సెల్ ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... లింగంపేట మండలం శెట్పల్లి సంగారెడ్డికి చెందిన ఒడ్డె గాలయ్య, సిద్దవ్వ టీవీఎస్ ఎక్సెల్‌పై గోపాల్‌పేటలోని జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా మెదక్ నుంచి ఎల్లారెడ్డి వైపు వెళ్తున్న కంటైనర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాలయ్య, సిద్దవ్వ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వేయి స్తంభాల ఆలయాన్ని పోలిన ఆలయం

మీకు తెలుసా?





దోమకొండ గడికోటలోని మహదేవుని ఆలయ నిర్మాణానికి అప్పట్లో వరంగల్ సంస్థానంను పరిపాలించిన రాణి రుద్రమదేవి వచ్చినట్లు శిలాఫలకం ఉంది. ప్రస్తుతం ఏదైనా కార్యక్రమాన్ని మంత్రులు, ఇతర ప్రముఖులు ప్రారంభించినప్పుడు ఏ విధంగానైతే శిలా ఫలకాలు ఏర్పాటు చేస్తున్నారో ఆ రోజుల్లో సైతం ఆమె ఆలయ నిర్మాణానికి వచ్చినప్పుడు శిలాఫలకం ఏర్పాటు చేసినట్లు పురావస్తుశాఖ ప్రతినిధులు గుర్తించారు. వరంగల్‌లోని వేయి స్తంభాల ఆలయాన్ని పోలిన విధంగా అదే శిల్పాకళా నైపుణ్యంతో ఇక్కడి మహదేవుని ఆలయ నిర్మాణం ఉంటుంది.

–దోమకొండ

సామరస్య పరిష్కారం కోసమే లోక్ అదాలత్



బాన్సువాడ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి, న్యాయవాదులు, అధికారులు



ఎల్లారెడ్డి కోర్టులో..



బిచ్కుంద కోర్టులో..

బిచ్కుంద(జుక్కల్): ఇరువర్గాల కక్షిదారులు సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవడానికే జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు బిచ్కుంద జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి వినిల్ కుమార్ అన్నారు. బిచ్కుంద కోర్టులో శనివారం జడ్జి అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. చాలా మంది క్షణికావేశానికి లోనై ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకొని ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఈసందర్భంగా రెండు వర్గాలు రాజీ కుదుర్చుకోవడంతో భూ తగాదాలు, క్రిమినల్ కేసులు, డ్రంకెన్‌డ్రైవ్, బ్యాంక్ తదితర 273 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో రూ.509,800 జరిమానా విధించారు. బ్యాంకు కేసులలో రూ.8లక్షల 7వేలు రికవరీ చేసి కేసులు పరిష్కరించారు. న్యాయవాదులు లక్ష్మణ్ రావు, మల్లేశ్వర్, విఠల్, ప్రకాష్, శివాజీ, మహ్మద్, శ్రీనివాస్ కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

బాన్సువాడ: బాన్సువాడ కోర్టులో శనివారం జడ్జి భార్గవి ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లోక్ ఆదాలత్‌లను కక్షిదారులు అందరూ ఉపయోగించుకోవాలని అన్నారు. న్యాయవాదులు లక్ష్మినారాయణమూర్తి, రమాకాంత్, దత్తాత్రి రావు, ఆనంద్, మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. లోక్ అదాలత్‌లో 322 కేసులను పరిష్కరించినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. డీఎస్పీ శ్రీనివాస్ రావు, సీఐ రవీందర్‌నాయక్, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, లింగంపేట ఎస్సైలు మహేష్, వెంకట్రావ్, మల్లారెడ్డి, ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్, న్యాయవాదులు పండరి, సతీష్, సాయిప్రకాష్ దేశ్‌పాండే, సాయిబాబా, శ్రీకాంత్, నవీద్ తదితరులున్నారు.

విరబూసిన బ్రహ్మ కమలం



బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం గ్రామ బీజేపీ నాయకుడు రాజిరెడ్డి ఇంట్లో శుక్రవారం రాత్రి బ్రహ్మకమలం విరబూసింది. దీంతో అతని కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు బ్రహ్మకమలాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఏడాదికి ఒకసారి మాత్రమే పూలు వికసించి కొన్ని గంటల వ్యవధిలోనే ముడుచుకుంటాయని రాజిరెడ్డి అన్నారు. పూలను శివాలయంలో సమర్పించారు.

గుంతల పూడ్చివేత



మాచారెడ్డి: మండల కేంద్రంలోని కామారెడ్డి, సిరిసిల్ల రహదారిపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. గుంతలతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో గ్రామ యువకులు ముందుకువచ్చి శనివారం రోడ్డుపై ప్రమాదకరంగా మారిన గుంతలను పూడ్చివేశారు.

క్రికెట్ లీగ్ టోర్నమెంట్ ప్రారంభం

నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–19 క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌ను శనివారం అర్సపల్లిలో శైలేజా మైదానంలో ప్రారంభమయ్యాయి. కోచ్ నయూమ్, ఫారస్‌లు టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. మొదటి మ్యాచులో గ్రీన్ వర్సెస్ ఎల్లో మధ్య జరిగింది. టాస్ గెలిచి గ్రీన్‌జట్టు బ్యాటింగ్ చేయగా 10 వికెట్లకు గాను 255 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎల్లో జట్టు 150 పరుగులకే ఆలౌట్‌కావడంతో గ్రీన్ జట్టు గెలిచింది. రెండో మ్యాచ్‌లో బ్లాక్ వర్సెస్ బ్లూ బ్లాక్ మధ్య పోటీ జరిగింది. ఇందులో టాస్ గెలిచిన బ్లూ బ్లాక్ జట్టు నిర్ణీత ఓవర్లలో 130 పరుగులు చేసి ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బ్లాక్ జట్టు నిర్ణీత ఓవర్లలో 105 పరుగులు చేసి ఆలౌట్‌కావడంతో బ్లూ బ్లాక్‌జట్టు గెలిచింది.

ఆలయాల పరిరక్షణ మన బాధ్యత



నిజామాబాద్ రూరల్: ఆలయాలను పరిరక్షించుకోడం మన బాధ్యత అని జిల్లా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. శనివారం నగరంలోని కబ్జాకు గురువుతున్న బోధన్ రోడ్‌లోని ఆటోనగర్ హనుమాన్ మందిరాన్ని రక్షించటానికి సహకరించాలని శ్రీ హనుమాన్ మందిర పరిరక్షణ కమిటీ ప్రతినిధులు ఎంపీని కోరారు. ఈ సందర్భంగా ఇందల్వాయి కిషన్ గంట్యాల వెంకటేశ్, అంబదాస్ రావు, మల్లేశ్ గౌడ్, దొర్నాల రవి, శాతాల లింబాద్రి, మధు తదితరులు అర్బన్ బీజేపీ క్యాంపు ఆఫీసులో అర్వింద్‌కు వినతి పత్రం అందించారు.

కడుపునొప్పి భరించలేక ఒకరి ఆత్మహత్య



అల్లూరి లింగారెడ్డి మృతదేహం

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని బాద్గుణ గ్రామానికి చెందిన అల్లూరి లింగారెడ్డి (57) కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. అల్లూరి లింగారెడ్డి కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కాగా, శుక్రవారం నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పంచగుడి గ్రామంలో ఉన్న తన చెల్లి వద్దకు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరాడు. కానీ, చెల్లెలి ఇంటికి వెళ్లకుండా మార్గమధ్యలో ఉమ్మెడ శివారులోని బ్రిడ్జి పైనుంచి గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి అల్లుడు తాటిపల్లి సాయిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

మనస్తాపంతో ఒకరు..

నిజామాబాద్ రూరల్: మోపాల్ మండలంలోని మంచిప్ప తండాకు చెందిన గోవర్ధన్(38) మంచిప్ప పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గోవర్ధన్‌కు అతని భార్యకు తరచూ గొడవలు జరుగుతాయి. మద్యానికి బానిసయ్యాడని శనివారం ఇంట్లో గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన గోవర్ధన్ మంచిప్ప పెద్ద చెరువులో దూకడాన్ని మృతుడి కుమారుడు శ్రీనివాస్ చూసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బైక్ చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని సతీశ్‌నగర్ కాలనీకి చెందిన షేక్ అజీం బైక్ చోరీకి గురైనట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి శనివారం తెలిపారు. వీక్లీ మార్కెట్‌లో ఓ దుకాణం ఎదుట పార్క్ చేసి పని ముగించుకొని వచ్చేలోపు బైక్ కనబడలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

వేల్పూర్: జాన్కంపేట్ గ్రామంలో శనివారం విద్యుత్ షాక్‌తో బండిరాము అనే రైతుకు చెందిన గేదె మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ శివారులో మేతకు వెళ్లిన గేదె(పోతు) ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తగలడంతో మరణించినట్లు పేర్కొన్నారు. గేదె విలువ రూ. 80 వేలు ఉంటుందని, బాధిత రైతుకు న్యాయం చేయాలని కోరారు.

బీబీపేటలో ఒకరి అదృశ్యం



శ్యాగ మల్లయ్య

బీబీపేట: మండల కేంద్రానికి చెందిన శ్యాగ మల్లయ్య గత నెల 31వ తేదీన అదృశ్యమైనట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పని నిమిత్తం ఇంటి నుంచి బయటికి వెళ్లిన మల్లయ్య ఇప్పటి వరకు తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో వరుసకు కుమారుడు అయిన పర్శ రాములు శనివారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎవరికైనా కనిపిస్తే సమాచారం అందించాలని ఎస్సై పేర్కొన్నారు.